# తెల్లకార్డు

ఆ ఊరు చెరువు పూడిపోక ముందు రెండుకారులు వరి పండేదట. ఇక బావుల కింద సరే సరి. మొత్తం మీద ఆ ఊళ్ళో ఎవ్వరూ ఉపవాసం ఉండేవారు కాదట. బోరులకాలం వచ్చి బావులుఎండిపోయినయ్. అక్కడక్కడ కొద్ది నీటితో తోటలు పెంచటం, వర్షం మీద ఆధారపడే మెట్ట పంటలు పండియ్యడం వల్ల జనానికి కూలి పనులు దొరకక పూటగడవటం కష్టమైంది. నీరు లేని ఊరు వట్టిపోయిన గోవులాంటిది. అందువల్ల తిండి, బట్టకరువైన జనం, సర్కారు సహాయానికి ఎదురుచూడక తప్పటంలేదు.

ఊరి చావడిలో శ్యామియానా వేసి "ప్రజలవద్దకుపాలన" అనే బ్యానర్ కట్టి, అక్కడి గ్రామస్థుల సమస్యలను పరిశీలిస్తున్నారు. అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు, ఇంకా చిన్నా, పెద్దా ఉద్యోగులు ఉన్నారు. జనం అర్జీలతో అక్కడికి వస్తున్నారు.

రోజుకూలి పని మాని అక్కడికే వచ్చి నిలుచొని ఆసందడిని చూస్తున్న ఆ ఊరి నివాసి రాములు ఎండనక, వాననక ఆఫీసుల చుట్టూతిరిగి ఎన్ని దండాలు పెట్టినా ముఖమన్నా చూడనోళ్ళు ఈయాల్ల ఈఊరికే వచ్చి ప్రజల పనులు చేస్తుండ్రే. అని అనుకుంటున్న రాములుకు గతంగుర్తొచ్చింది.

*　　　*　　　*

ఆ రోజుల్లో ఇన్ని మండలాలు లేవు. కొన్నేతాసిలు ఆఫీసులు ఉండేవి. అయిగూడ మైళ్ళకొద్ది దూరంలో ఉండేవి. అప్పుడు ఇన్ని బస్సులు లేవు. సద్ది సంకన పెట్టుకొని నడకే నడక. తీరా అక్కడకు పోయినంక దఫేదారు లోపలికి పోనియ్యక పొయ్యేది. మా అంటే గిర్దావరు తప్ప తసీలుదారుడు కనుపడకపొయ్యేది. అంతా పట్వారీలదే పెత్తనం. శిస్తువసూలు, దొంగతనం, లంజతనం, దండుగలు, దండనలు అన్నీ ఆల్లేసూసేది. పట్వారీలు పోయి మండలాలు వచ్చినంక ఆఫీసులకు జనం రాకపోకలు పెరిగినయ్. ఎక్కడ ఏం జరుగుతుందీ ఆ నోట, ఈ నోట తెలిసిపోతూనే ఉంది. అయినా, రావాల్సిన వారందరికి రేషన్ కార్డులు, ఇవ్వాల్సిన వాళ్ళందరికీ ఇండ్లభూముల విషయంలో నాన్పుడు ఇంకా నడుస్తూనే ఉంది. భూమిని కొలవమంటే కొలవరు, జమాబందిని పట్టించుకోరు. ఆఫీసు చుట్టూ తిప్పుడే తిప్పుడు.

తినే బియ్యం ధరను, తాగే సారాను ఆర్రాజ్ సేసిరి. పాకెట్లల్ల నింపి ఊరూర పంచిరి. సర్కారు తల్చుకుంటే సాగందేంది. మల్ల ఏమనిపించిందో సార బందనిరి. కాయకష్టం చేసి అలసి సొలసి కల్లు నీళ్ళన్నా తాగుదామంటే పెద్ద పెద్దోళ్ళు దానికే ఎగబడిరి.

ఒకందానబాదలా. అయిదారు ఏండ్ల కింద ఓ రోజు యమ్మార్వో ఆఫీసుకు పోయి

"అయ్యా రేషన్ కారటు"

రాములు చేతులు జోడిస్తూ అన్నాడు. యమ్మార్వో తలఎత్తి చూడలేదు.

"అందరికి ఇచ్చింండ్రు, నాకే ఇయ్యలేదు దొర" మళ్ళీ తానే అన్నాడు.

"ఎందుకు?" మనిషివైపు చూడకుండానే అడిగాడు.

"తెలవదు" అమాయకంగా ముఖాన్ని అడ్డంగా కదిలిస్తూ అన్నాడు.

"తెలవనట్టే ఉండు" అనడంలో ఎగతాళి ధ్వనించింది.

"ఈ ఆఫీసు చుట్టూ తిరిగి తిరిగి ప్రాణం ఏసారి తమరన్నట్టు తెలవనట్టే వున్న. మొన్న గిరిదావరి మాఊరొచ్చినపుడు ఆఫీసుకు వచ్చి కలువు అంటే వచ్చిన దొర" ఈ తప్పు తనది కాదు అన్నట్టు చూస్తూ అన్నాడు.

ఒక్కసారె శబ్దం రాగా రాములు ఉలిక్కిపడి చుట్టూ చూశాడు. "సర్" అంటూ అటెండర్ లోపలికొచ్చి అక్కడ నిల్చున్న పల్లె వాసినిచూసి -

"అరె ఏమయ్యా లోపలికెట్ల వచ్చినవు" కోపంగానే అడిగాడు.

"తలుపు తీసే ఉంది సారూ అన్నాడు" కొంచెం ఆట పట్టించే ధోరణిలో.

"తలుపు తీసి ఉంటే పరద వేసి లేదా?" కొట్టొచ్చినట్టు అన్నాడు.

"ఉన్నది" అన్నట్టు తలూపాడు రాములు.

"అడగకుంట వస్తే ఎట్టా?" కొంచెం కళ్ళు పెద్దవి చేస్తూ అడిగాడు.

"దర్వాజ కాడ ఎవరూ లేరు" అన్నాడు అమాయకంగా.

"నేనెక్కడకు పోయిన" అంటూ మీదిమీదికి పోయినట్టు కదిలాడు.

"చెట్టుకింద బీడీ తాగుతున్నవు" ఉన్నమాట అంటున్నట్టు చూస్తూ అన్నాడు.

ఆఫీసరు ముందు అట్ల అన్నందుకు కాస్త తత్తర పడ్డాడు అటెండర్. అతను మాట్లాడుతూ ఉంటే ఇంకా బీడీ తాగిన వాసన వస్తూ ఉంది. వికారపు కారుకంపు.

"బాగుందా - ఆర్.ఐ. ని పిలువు" ఏదో ఫైలును చూస్తూ ఎమ్మార్వో అన్నాడు.

"అయ్యా" అంటూ బయటకు నడుస్తున్నప్పుడు 'నీవు చుట్ట తాగవాబే' అన్నట్టు రాములును చూసి బయటకు నడిచాడు.

"పిలిచారా సార్" పరదాను పక్కకు తోసి, లోనికి వస్తూ ఆర్.ఐ అన్నాడు.

"ఈయనను రమ్మన్నారా?" మొదట రాములును చూసి, ఆ తరువాత ఆర్.ఐ. వైపు

చూస్తూ అడిగాడు.

అక్కడ నిల్చున్న రాములుని చూడగానే కేసు గుర్తొచ్చి -

"ఈయన సంగెం, హరిజన్ సార్" చేతిని రాములు వైపు ఉంచుతూ అన్నాడు.

"నేను కులం అడగలేదు. నేవు జీవోను చూడలేదా? హరిజన్ అని నోటితో అనకూడదు, కాగితం మీద రాయకూడదని ప్రభుత్వం ఆజ్ఞ"

నాలిక కరుచుకుని "దళితుడు" అన్నప్పుడు ముఖాన నవ్వు కదిలింది.

"అది, యదారాజా తదా మనం" ముసిముసిగా నవ్వుతూ అన్నాడు.

"అంతేగా సార్" చూపులో చూపును, నవ్వులో నవ్వును కలుపుతూ.

"ఈయన కార్యుట ఎంతవరకొచ్చింది?"

"వీళ్ళ ఊరి దరఖాస్తులు చాలానే ఉన్నయి"

"వచ్చినప్పుడల్లా అగిస్తాం, ఇగిస్తాం అంటరు. ఇయ్యనే ఇయ్యరు" అన్నాడు రాములు.

"మా చేతుల్లో ఏముంది? ప్రభుత్వం ఎట్ల అంటే అట్ల"

"ప్రభుత్వం అంటే ఆల్లేనా దొరా?"

"కాదు మరీ. మీరు ఓటేసి ఎన్నుకున్నోళ్ళే ప్రభుత్వం"

ఆర్.ఐ. రాములుకు సంబంధించిన ఫైలు కొరకు సెక్షన్‌లోనికి వెళ్ళాడు.

"నీవు ఎవరికి ఓటేసినవ్?"

"ఎవరికి ఏస్తే ఏముంది? వోట్లకు ముందు భూమి లేనోళ్ళకు భూములిస్తం, ఇండ్లు లేనోళ్ళకు ఇండ్లిస్తం, అప్పిస్తం-సప్పిస్తం, అది సేస్తం, ఇది సేస్తం అంటారు. ఏసినంక గెలిసి కనబడకుండ పోతరు" అక్కసుతో అన్నాడు.

టెలిఫోన్ మోగింది.

"హలో"

"యమ్మార్వో గారా?"

"మాట్లాడుతున్నా"

"నమస్కారం సారు. ఎస్డీవో ఆఫీసు నుంచి"

"చెప్పండి" ఫ్యాన్ వైపు చూస్తూ అన్నాడు.

"మా యస్డీవో గారి ఇంట్లో సత్యనారాయణ వ్రతం ఉంది"

"తప్పక వస్తాను. మాట్లాడమను. లేరా?"

"స్ట్రాంగ్ రూమ్‌లో ఉన్నారు. పంచదార కావాలి సార్"

"పంచదార - చూద్దాం" చూపులను ఫోను మీదికి మళ్ళిస్తూ.

"సార్ తప్పక కావాలి. అదిలేందిపని జరుగదు" ఏదో నిష్ఠురపు హెచ్చరిక వినిపించింది. ఫోన్ పెట్టేశాడు.

"ప్రతి ఒక్కనికి పంచదార కావాలె" అనుకుంటూ గొణుక్కున్నాడు.

"అదివిన్న రాములు ఆయనకు కూడా కారటు లేదా సాయా" అమాయకంగా అడిగాడు.

యమ్మార్వోకు ఎందుకో కలుక్కుమనిపించినా తెచ్చిపెట్టుకున్న నవ్వుతో రాములును మరిపించాడు.

ఆర్.ఐ. ఫైలుతో వచ్చి

"పేరు రాములు, వృత్తి బిజినెస్, - మరి ఈయనకు ఏ కార్డు సార్?"

"ఏకార్డు ఇస్తవ్ ?"

సందు దొరికితే చాలు, కింద మీద రెవెన్యూ ఫార్ములా.

"పింక్ సార్"

గారడి వాడు ఒకనికి గంతలు కట్టి 'నీ కళ్ళకు కట్టిందేమిటి' అని అడిగితే గుడ్డ అన్నట్లు అన్నాడు.

రాములుకు ఇంగ్లీషు రాదు కానీ పింక్ అంటే ఫలానా రంగు అని తెలుసు.

"ఆ కారటుకు రెండు రూపాయల బియ్యం రావుకదా?"

"రావు" తెలిసిన సంగతినే తెగేసి చెప్పాడు.

"రాంది నాకెందుకు?" అందరికి తెల్లకారట్లు ఇచ్చి నాకెందుకు ఇయ్యరు? కొంచెం తెలివిని, ధైర్యాన్ని కలబోసి అన్నాడు.

"నీవు వ్యాపారం చేస్తున్నవుకదా" యమ్మార్వో మళ్ళీ రెవెన్యూ ఫార్ములా ఉపయోగించాడు.

"నెత్తిన మూటతోటి ఊరూరా తిరిగి బట్టలు అమ్ముకొనేది కూడా -"

మధ్యలోనే ఆగాడు.

"రిపోర్డులో రాసి ఉంది. తరువాత కలువు చూద్దాం" ఫైల్‌ను మూస్తూ అన్నాడు.

* * *

మీ సమస్యలను తీర్చడానికి ప్రభుత్వం మీ వాకిట్లోకొచ్చి నిలుచుంది. అని జీపుకున్న మైకు మాట్లాడగా రాములు ఈ లోకంలోకి వచ్చాడు. మెల్లగా జీపువైపు నడిచి మాట్లాడుతున్నది ఎవరా? అని చూశాడు. అందులో ఎవరూ లేరు. మరి మాట్లాడింది ఎవరు? జీపులో టేప్ రికార్డరును చూసి ఆహా ! మాటలని నింపి పెట్టింద్రే అనుకుంటూ రెవెన్యూవాళ్ళు కూర్చున్నవైపు వస్తున్న రాములును చూసి వి.ఏ.ఓ. అయనికి సంబంధించిన రేషన్‌కార్డు ఫైలును తీసి, యమ్మార్వో ముందుంచుతూ -

'వొచ్చి అడిగినా దిక్కు లేని రోజులు పోయి మనిషిని చూసి ఫైలు తీయాల్సి వచ్చె. ఏం కాలమొచ్చె. ఎటువంటి ప్రభుత్వమొచ్చెరా తండ్రి? ఎన్‌టిఆర్ వొచ్చి ఎంత పని చేశారు' అని తనలో తానే గొణుకున్నాడు.

'ఈయనకొత్త యమ్మార్వో. ఈ పదేండ్ల నుండి ఎందరు మారింద్రు' అనుకుంటూ వచ్చి నిలుచున్నాడు.

"చెప్పండి"

"అమ్మా సెప్పండి"

'ఎంత మార్పు. దండం పెట్టినా తలెత్తి సూడని దొరలు దూరం నుండి సూసే సెప్పండి అనటమా నన్నేనా?' అనుకుంటూ ఓసారి అటు ఇటు చూసి -

"ఏం సెప్ప, అదే రేషన్‌కారటు. అది లేంది నాకు ధోతులు ఇవ్వడం లేదు, నా పెండ్లానికి చీరలు ఇవ్వటం లేదు. ఎన్నో ఏండ్ల నుండి మీ ఆఫీసు చుట్టూ తిరుగుతున్నా, నా కారటు ఇస్తలేరు". ఓట్లు అడగడానికి వచ్చిన అభ్యర్థిని అది, ఇది అడిగినట్లు అడిగాడు.

"ఈయనకు కార్డు ఇచ్చినట్టుంది కదా. వి.ఏ.ఓ వైపు చూస్తూ అడిగాడు"

"ఇచ్చినం సార్"

"ఇస్తే ఇవ్వలేదని ఎందుకంట సారూ?" ఈసారి రాములు ముఖంలో కొంత విసుగు కనిపించింది.

'దొంగ కొడుకులు నా కార్డు ఎవ్వనికి అమ్ముకుంద్రో. మా పేరు మీదా, ఊరుమీదా పెద్ద పెద్ద దవాఖానలల్ల గూడ ఈ కారట్లనే చూపించి పైసలు ఎక్కువ కర్సు కాకుండా సూసుకుంటరట. ఇదెక్కడి దోపిడీరో దేవుడో? పసుల నోటికాడి గడ్డినే అమ్ముక తింటుంద్రని పేపరికిచ్చిరి. పిల్లలకిచ్చే పాలపొడిని వోటలల్ల అమ్ముతుంద్రట. అన్ని అమ్ముడే ఇగ. ఎన్నడో ఒకనాడు ఈ దేశాన్నే అమ్ముతరు. అంతే' అనుకుంటూ నిల్చుండిపోయాడు.

"ఇదిగో తీసుకున్నట్టు నీ వేలి ముద్ర" రిజిష్టర్‌ను రాములు ముందుంచాడు వి.ఏ.ఓ.

"నేను పేరు రాస్తా సారు. ఇది నాది కాదు" అన్నాడు. ఆ వేలిముద్ర నాదికాదు

అన్నట్టు చూస్తూ.

"నీవు రాయ నేర్చుకుంది నిన్నామొన్న. చదువు - వెలుగులనాయే. కార్డు తీసుకుందేమో ఏడేండ్ల కిందాయే " వి. ఏ. ఓ. తిమ్మిని బమ్మిని చేసే పట్వారీ ఫార్ములానుపయోగించాడు.

"మొదటిసారె ఇచ్చినట్టుంది. ఓసారి డీలర్‌ను అడిగిరమ్మను " అన్నాడు యమ్మార్వో. వాయిదా వేసే అలవాటును వాడుకున్నాడు.

"రాములు డీలర్‌ను అడిగిరా పో ". అన్నాడు. వి. ఏ. ఓ.

"మేము మారినా నీవు మారలేదు కదయ్యా. నీది ఈ ఊరే కదా. నీకు తెలిసే ఉండాలి ". అంటూ వి. ఏ. ఓ. వైపు చూశాడు యమ్మార్వో.

"సార్ " వంగి చెవిలో చిన్నగా అన్నాడు.

యమ్మార్వో అది విని అసహనంగా కదిలాడు.

'అంటే ఇన్నేండ్ల నుండి నా బియ్యాన్ని ....' అనుకుంటూ రాములు డీలర్ కొట్టువైపు నడవసాగాడు.

తోవలో ఓ గాడిద ఓ తెల్లకాగితాన్ని మేస్తూ కనిపించింది.

'కొంపతీసి నా కారటు అయితే కాదుకదా ' అనుకుంటూ దాని వైపు కొంతసేపు చూసి డీలర్ కొట్టు ముందుకొచ్చి నిలుచున్నాడు. డీలర్ కొట్టును సగం తెరచి ఆ రోజు పేపర్ చదువుతూ కూర్చున్నాడు. పొట్లకాయలాగా ఉన్నవాడు సొరకాయలాగా అయ్యిండు. గుర్తుపట్టటం కష్టం అనిపించింది రాములుకు.

'కొట్టు ఎదురుగా స్టాకు లేదు ' అని బోర్డు పెట్టి ఉంది.

"సేటూ నా కారటు నీదగ్గర ఉందట " ఎంతో ఆశగా అడిగాడు.

"నా దగ్గరనా నీ కారటు నా దగ్గరెందుకుంటది? " రెండు చేతులలో ఉన్న పేపరును ఒక్క చేతిలోకి తీసుకుంటూ అన్నాడు.

"పట్వారీ చెప్పిండే మరి "

"ఆయన గట్లనే చెప్తుతడు. ఆ విషయం ఆయన్నే అడుగు " అంటూ పేపరు మళ్ళీ రెండు చేతుల్లోకి తీసుకొని, నిన్న జరిగిన జిల్లా రేషన్ డీలర్ల సంఘం ఎన్నికల గురించి ఏమన్నా వచ్చిందా అని చూస్తూ ఉన్నాడు.

"సరే తినండి, బియ్యం మీరే తినండి, పచ్చగడ్డి మీరే తినండి " అంటూ అక్కడినుండి కదిలాడు రాములు.

'ఇన్నేండ్లకు ఇప్పుడు గుర్తొచ్చినాది కార్డు ' తనలో తాను అనుకుంటూ మళ్ళీపోతున్న

రాములును జాలిగా చూశాడు డీలర్.

'సదువు రాని వోన్ని చూసి గదా ఈల్లు ఇట్లా సేసేది. సర్కారు ఇచ్చే అప్పులు అందనీయరైరి. ఇండ్ల భూములు దక్కనీయరైరి. పైరవీకార్ల మాటలే ఇని ఆల్లు సెప్పినట్లే సేసిరి. తాతల నాటి కులవృత్తి ,తండ్రి నాటి గుడిసె. అయాల్ల అదే బతుకు. ఈయాల్ల అదే బతుకు ' అనుకుంటూ తిరిగి వస్తున్నప్పుడు మళ్ళీ తోవలో గాడిద వైపు చూశాడు. అది ఇంకా కాగితాలను తింటూనే ఉన్నది.

* * *

ఓ సంవత్సరం తరువాత ఊళ్ళోకి జీప్ వచ్చి చావిట్లో ఆగింది. దానికి "రవెన్యూ మేలా " అనే బ్యానర్ కట్టి ఉంది. జీప్‌లో నుండి యమ్మార్వో, ఆయన స్టాపు దిగారు. అంతకంటే ముందే అక్కడికి వి.ఏ.ఓ., విలేజ్‌సర్వెంట్లు, వచ్చి ఉన్నారు. అప్పటికప్పుడు కుర్చీలు, బల్లలు చేర్చి చెట్టు కింద ఆఫీసు తెరిచారు. అది తెలుసుకున్న జనం దరఖాస్తులతో వస్తున్నారు. భూముల పాస్ పుస్తకాలు పంచుతున్నారు. మిగిలినవారికి రేషన్ కార్డులు ఇస్తున్నారు. ఇండ్ల భూముల పట్టాలు ఇస్తున్నారు. వి.ఏ.ఓ. రాములు పేరు పిలిచాడు. రాములు జీప్ దగ్గర నిలుచుని జరుగుతున్న మేళాను చూస్తూ ఉన్నాడు. రెండవసారి పిలిచాడు. రాములు రాలేదు. దూరంగా నిలుచున్న రాములుని చూసి వి.ఏ.ఓ రా రమ్మని సైగచేశాడు. రాములు నవ్వుతూ కదిలాడు. అతని తలనిండా గడచిన కాలపు గడ్డు సమస్యలు. అతని నవ్వును అర్థం చేసికొన్న యమ్మార్వో తన పెదాలపై నవ్వును తెచ్చుకొన్నాడు. ఇంతకుముందు ఏ అధికారీ నవ్వకపోగా, తమ మౌనంగా తమ హోదాను ప్రదర్శించేవారు. తన ముందుకొచ్చి నిలుచున్న రాములుతో

"ఏమి నవ్వుతున్నవు " అని అడిగాడు నవ్వు ముఖంతోనే.

'మీ ఆఫీసుకు వస్తే లోపలికి రానీయరు. మాట్లాడరు. ఇచ్చిన కాయితం కనపడదు. ఎన్నిసార్లు మీ ఆఫీసు చుట్టూ తిరిగిరాలేదు. ఇగ ఈయాల్ల మీరే మా ఊరికి కాగితాలు తీసుకొచ్చి పంచుతుంటే నవ్వురాక ... 'అని మనస్సులో అనుకుంటూ "ఏం లేదు దొర. ఏదో ఆదికొచ్చింది " అని అన్నాడు. కానీ అతని మనస్సులో ఉన్నది ముఖంలో కనిపిస్తూనే ఉంది.

"ఎవరు దొర? మేం దొరలం కాదు. మీసేవకులం " అన్నాడు యమ్మార్వో నవ్వుతూనే. ఇప్పుడాయన, ఆయన సిబ్బంది ఊరి చావిట్లో ఉన్నారు. నవ్వక తప్పదు మరి.

'మీరెందుకాయే సేవకులు, మీరు గాలి పంకాల కింద కాలు మీద కాలేసి కూర్చోని వచ్చెటోళ్ళముఖమైన చూడకుండా, సూద్దాం - సేద్దాం అనేటోళ్ళు సేవకులు ఎట్లయితరు? ఏలే దొరలు. నా చిన్నప్పటినుండీ సూస్తున్న. మీ సుట్టే మేం తిరిగినం. మా దగ్గరికి

మీరొచ్చింద్రా. ఆ కాలంలో ఏ గిర్దావరో మా ఊరొస్తే, ఎంత ఇది. కోడిపుంజు, గట్టికల్లు, ఎండ తగలకుండా గొడుగు పట్టటం, గాన్ని పిలువు, వీన్ని పిలువు, ఎట్టోళ్ళ ఉరుకులు, పరుగులు. కదిలితే కచ్చడం, పటేలు పట్వారీలు సాగిచ్చుడు సరేసరి' అని తనలో తాను అనుకుని,

"అట్లనకండి సారూ" అని నవ్వును నటించాడు.

"ఇదిగో నీ తెల్లకార్డు" అంటూ రాములు చేతిలో తెల్లకార్డును ఉంచాడు యమ్మార్వో.

"ఇందులో సంతకం చేయి" అంటూ రిజిష్టర్ ను ముందుంచాడు.

ఆలోచిస్తూ నిలుచున్న రాములుకు ఏదో తట్టినట్లు వి. ఏ. ఓ. వైపు చూస్తూ "ఇంతకుముందే నా వేలిముద్దెర ఉందన్నవు గదా మల్లెందుకు" అని అడిగాడు రాములు.

అది విన్న రెవెన్యూ వాళ్ళ నోట మాట రాక బొమ్మల్లా నిలుచుండిపోయారు.

"ఒక్క కార్డుకు ఒక్క సంతకమే కదా" తర్కంలోకి దిగాడు రాములు.

"అంతేగ" అన్నారు అక్కడున్న జనం. రెవెన్యూ వాళ్ళు ఒకరి ముఖం మరొకరు చూసుకుంటూ నిలుచుండిపోయారు.

"ఇది ఇన్నాళ్ళు ఎక్కడుందో దొరా" కార్డునే చూస్తూ ఆరా తీసినట్లు అడిగాడు.

"అదిగో మళ్ళీ దొర...." మెల్లగా, మెత్తగా అన్నాడు యమ్మార్వో.

రాములు ఈసారి ముసిముసిగ నవ్వాడు. వెనకట దొరంటే కళ్ళల్లో కాంతి నిండేది. అదే జనం ఇప్పుడు దొరంటే కొరడాతో కొట్టినట్టనిపిస్తుంది.

అటు నవ్వలేని, ఇటు ఏడ్వలేని దుఃస్థితి.

"అయ్యా, నెలగాసానికి పొలం పనులు సేసే మమ్ములను జీతగాళ్ళు అని పిలుస్తారు. ఆ సామి సెప్పిన పని సేస్తం. మీరు నెల జీతం తీసుకుంటరు. అవసరమున్న పని అస్సలు సెయ్యరు" అని రాములు అనగానే -

ముప్పదేండ్లుగా ఆ ఊరిని పాలించి, వతన్దార్ల ఉద్వాసన వేటుకు గురై, తిరిగి వి.ఏ.ఓ.గా పనిచేస్తున్న రామారావుకు నోరురాక రాములునే చూస్తూ నిలుచుండిపోయాడు.

చెట్టుకింద ఆఫీసు జనంతో కిటకిటలాడుతూ వుంది.

నవంబర్ 97 ●